సాక్షి రంగారెడ్డి

శుక్రవారం | 8 | ఆగస్టు | 2025



ఆప్యాయతల 'రక్షాబంధన్'

అక్కాచెల్లెళ్లు.. అన్నాదమ్ములకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకుంటారు.. రాఖీ పండుగను జరుపుకొంటారు.

8లో▸



బీసీలు రాణించాలి

బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు.

8లో▸



మనువాదాన్ని..

ప్రత్యేక రాష్ట్రంలోనూ దళితులపై దాడులు జరుగుతున్నాయని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్ ఆరోపించారు.

8లో▸

న్యూస్‌రీల్

పట్టణాలను హరిత వనాలుగా మార్చాలి

సీడీఎంఏ డైరెక్టర్ జ్యోత్స్న



మొక్క నాటుతున్న జ్యోత్స్న తదితరులు

షాద్‌నగర్ రూరల్: ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవంతో పట్టణాలు పచ్చని వనాలుగా మారాలని సీడీఎంఏ డైరెక్టర్ జ్యోత్స్న అన్నారు. గురువారం మున్సిపల్ పరిధి 10వ వార్డులోని ప్యారడైజ్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ సునీత ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మొక్క నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆకుపచ్చ తెలంగాణ రాష్ట్రమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పచ్చదనం పెంపొందించాలని కోరారు. సకాలంలో వర్షా లు కురవాలన్నా.. వాతావరణ సమతుల్యత కాపాడాలన్నా.. మొక్కల పెంపకం అవసరమన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వనమహోత్సవంలో భాగస్వాములై ప్రతి ఇంటికి మొక్క నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రావణి, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనతో విద్యార్థుల విజయం

రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ డాక్టర్ వెంకటేశ్



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో వెంకటేశ్ తదితరులు

మాడ్గుల: ఉత్తమ బోధనతో విద్యార్థుల విజయం సాధ్యమవుతుందని రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ డాక్టర్ చారకొండ వెంకటేశ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇర్విన్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వెంకటేశ్ ట్రిబుల్ ఐటీ, ఎస్ఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో ఇర్విన్ విద్యార్థుల సత్తా అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల ప్రణాళికాయుత బోధనతోనే విజయాలు సాధ్యమవుతున్నాయని కితాబిచ్చారు. సమాజంతో పాటు వ్యక్తిగతంగానూ గుర్తింపు పొందాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం హెచ్ఎం పర్వతాలును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సుశీంధర్ రావు, ఏంఈఓ సర్దార్ నాయక్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సినీ హీరో గోపీచంద్



హీరో గోపీచంద్‌తో కార్యాలయ సిబ్బంది

శంకర్‌పల్లి: సినీ హీరో గోపీచంద్ గురువారం శంకర్‌పల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి విచ్చేశారు. మండల పరిధిలోని బ్లూమ్స్ వెంచర్‌లో ఉన్న 400 గజాల విల్లా విక్రయానికి గాను ఆయన కార్యాలయానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. విషయం తెలుసుకున్న అభిమానులు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకుని సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు. దీంతో ఒకింత ఇబ్బంది పడిన గోపీచంద్ పని పూర్తయిన వెంటనే పట్టణ శివారులోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు.


గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: దాదాపు రూ.6 లక్షల విలువైన 11.5 కిలోల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. తీగ లాగితే డొంక కదిలినట్లుగా సరూర్‌నగర్ చైతన్యపురికి చెందిన భూక్య శ్రీకాంత్ వద్ద 340 గ్రాముల గంజాయిని మొదట పట్టుకున్నారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు అబ్బాస్ అనే వ్యక్తి వద్ద నుంచి 850 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నా రు. అబ్బాస్ ఇచ్చిన సమాచారం మేరకు నడిమింటి మమత అనే మహిళ ఇంట్లో 10.693 కిలోల గంజాయిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి మొత్తం 11.5 కిలోలు పట్టుకున్నట్లు రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ తెలిపారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

రియల్ మాయ!



నక్షబాటను కబ్జాచేసి ఏర్పాట్లు చేసిన ప్రీకాస్ట్ వాల్



పద్మావతి కాలనీ వెంచర్ లేఅవుట్

ముర్తుజగూడలో మూడు ఎకరాలు కబ్జా

- 111 జీఓ పరిధిలో అనధికారిక వెంచర్లు
- యథేచ్ఛగా ప్లాట్ల అమ్మకాలు
- నక్షాభూమిని కబ్జా చేయడంతో వెలుగులోకి..
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అది పూర్తిగా 111 జీఓ పరిధిలో ఉన్న భూమి. డీటీసీపీ, హెచ్ఎండీఏలు సైతం వెంచర్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయవు. కానీ కొంత మంది రియల్టర్లు ఏకంగా అనధికార వెంచర్ చేశారు. గుంటల్లో ఉన్న వ్యవసాయ భూమిని గజాల్లోకి మార్చి గుట్టుగా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్లు చేశారు. ఇంతటితో ఆగకుండా నక్షబాటను కబ్జా చేసి పక్కనే ఉన్న పట్టా భూముల్లో కలిపేశారు. చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి సరిహద్దు భూముల్లోకి ఇతరుల రాకపోకలను నిలిపివేశారు. కబ్జాకు గురైన నక్షబాటకు విముక్తి కల్పించాలని కోరుతూ ఓ బాధితుడు ఇటీవల కలెక్టర్‌కు విన్నవించారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి, నక్షబాట ఉన్నట్లు ఇప్పటికే నిర్ధారించినప్పటికీ.. దారి వదిలేందుకు రియల్టర్లు మాత్రం అంగీకరించడం లేదు. విధిలేని పరిస్థితుల్లో సదరు బాధితుడు కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.

అనధికారిక వెంచర్.. అడ్డగోలు అమ్మకాలు

2018లో మొయినాబాద్ మండలం ముర్తుజగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 251, 252(ఓల్డ్ సర్వే నంబర్లు 88,146)లోని 11.24 ఎకరాల్లో కొంతమంది రియల్టర్లు 165 ప్లాట్లతో అనధికారిక వెంచర్ చేశారు. పద్మావతి కాలనీగా నామకరణం చేశారు. గుంటల్లో ఉన్న భూమిని గజాల్లోకి మార్చి, గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేయించారు. ఈ క్రమంలో భూములకు ఆనుకుని ఉన్న 253 సర్వే నంబర్‌లోని నక్షబాటను సైతం కబ్జాచేసి పద్మావతి కాలనీలో కలిపేశారు. 111 జీఓ పరిధిలో వెంచర్ చేయడంతో పాటు 120 నుంచి 350 గజాల చొప్పున ప్లాట్లు చేసి విక్రయించారు. ఆ వెంచర్ నుంచి పై భాగంలో ఉన్న వ్యవసాయ భూముల్లోకి వెళ్లే వారికి దారి లేకుండా చేసి రాకపోకలను నిషేధించారు. ప్రజావసరాల కోసం వదిలిన ఖాళీ స్థలాలను(1,866 గజాలతో ఒకటి, 216 గజాలతో మరొక పార్కును) ముర్తుజగూడ గ్రామ పంచాయతీ పేరున గిఫ్ట్ డీడ్ చేయడం కొసమెరుపు. నాలా కన్వర్షన్ కూడా కానీ ఈ భూములను రిజిస్ట్రేషన్లు ఎలా చేస్తున్నారో అంతు చిక్కడం ప్రశ్న. వాస్తవ విస్తీర్ణానికి మించి వెంచర్‌లో భూములున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పక్క సర్వే నంబర్లలో ఉన్న మూడు ఎకరాల ఇనాం భూములను ఈ అనధికారిక వెంచర్‌లోనే కలిపేసినట్లు సమాచారం. స్థానికంగా రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు రియల్టర్లతో కుమ్మక్కై.. కళ్ల ముందే అక్రమంగా వెలుస్తున్న వెంచర్లను చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా రియల్టర్లకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.

దారి చూపండి

ముర్తుజగూడ సర్వే నంబర్ 254లో 1.16 ఎకరాల పట్టా భూమి ఉంది. సరిహద్దులోని సర్వే నంబర్లు 251, 252లో నక్షబాట ఉండేది. పట్టా దారులు ఆ నక్షబాటను కబ్జా చేశారు. రెండు సర్వే నంబర్లలోని మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం ఆక్రమించి అనధికారిక వెంచర్ చేశారు. వెంచర్ చుట్టూ ప్రీకాస్ట్ వాల్స్‌ను ఏర్పాటు చేశారు. నక్షబాటను కబ్జా చేసి ప్లాట్లు చేయడంతో పాటు ఇతర రైతులు తమ భూముల్లోకి వెళ్లకుండా దారి మూసివేశారు. అధికారులు వెంటనే స్పందించి నక్షబాటను పునరుద్ధరించాలి.

– ఆర్.మల్లికార్జున్, బండ్లగూడ

అవన్నీ అక్రమ వెంచర్లే..

అనధికారిక వెంచర్‌లో నక్షబాట ఉన్నట్లు గుర్తించాం. మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి ఇతర రైతులకు ఇబ్బంది కలిగించే విధంగా ఏర్పాటు చేసిన ప్రహరీ తొలగిస్తాం. 111 జీఓ పరిధిలోని వెంచర్లకు ప్రభుత్వ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. జీఓ పరిధిలో ఉన్న వెంచర్లన్నీ..అక్రమమైనవే.

– గౌతంకుమార్, తహసీల్దార్, మొయినాబాద్

హామీల అమలుకు పోరాటం

- 30న 'చలో కొండారెడ్డిపల్లి'
- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

మాడ్గుల: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని గురువారం మండల కేంద్రంలో బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు భారీ ర్యాలీతో తహసీల్దార్ కార్యాలయానికి తరలివెళ్లి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్లు పెంచాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రభు త్వం నిధులు మంజూరు చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినట్లు చెప్పుకొంటుందన్నారు. హామీల అమలుకు ఈ నెల 30 న చలో కొండారెడ్డిపల్లి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, మండల అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, నాయకులు రామకిషన్, వెంకటేశ్, నర్సింహ, శ్రీను, వెంకన్న, అశోక్, సునీల్, రాజు, భూపేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచారి

రైస్‌మిల్ నుంచి రసాయన వ్యర్థాలు

- దుర్గంధంతో ఇబ్బంది పడిన స్థానికులు
- ఆందోళన చేపట్టిన ఉప్పరిగూడ గ్రామస్తులు



రైస్‌మిల్లు నుంచి వదిలిన వ్యర్థాలు

ఇబ్రహీంపట్నం రూరల్: రైస్‌మిల్ మూసివేయాలని ఉప్పరిగూడ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని ఉప్పరిగూడలో గురువారం శ్రీనివాస రైస్ మిల్ నుంచి నాలుగు ట్యాంకర్లకు పైగా రసాయన వ్యర్థాలను రోడ్డుపైకి వదిలారు. పోచారం వరకు ఈ వ్యర్థాలు పారుతుండడంతో రాకపోకలు సాగించిన వారు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రైస్‌మిల్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టి అనుమతులు లేకుండా పరిశ్రమ నెలకొల్పారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిల్లు యజమానికి సమాధానం ఇవ్వకుండానే అక్కడ నుంచి వెనుదిరిగారు. ఈ ఆందోళనలో ప్రభాకర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శివకుమార్, మంత్రి శ్రావణ్, మోహన్‌రెడ్డి, కృష్ణ, మహేందర్, సుక్రు, గ్రామస్తులు పాల్గొన్నారు .

మూడు రోజులైనా దొరకని ఆచూకీ

కృష్ణానదిలో కొనసాగుతున్న గాలింపు చర్యలు



శివ(ఫైల్)

నాగార్జునసాగర్: నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు చూసేందుకు వచ్చి కృష్ణా నదిపై నిర్మించిన కొత్త వంతెన పైనుంచి దూకిన యువకుడి ఆచూకీ మూడు రోజులైనా లభించలేదు. మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన మంథని శివ(23) తన స్నేహితులైన దుసరి ప్రసాద్(గణేశ్), సొప్పరి శివ, పండుగ నర్సింహతో కలిసి ఈ నెల 4న నాగార్జునసాగర్ పర్యటనకు వెళ్లారు. నందికొండ మున్సిపల్ పరిధిలోని పైలాన్ కాలనీలో కృష్ణా నదిపై ఉన్న కొత్త వంతెన మీద నిలబడి ఫొటోలు దిగే క్రమంలో శివ వంతెన పైనుంచి కృష్ణా నదిలోకి దూకి గల్లంతయ్యాడు. శివ తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులుగా ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు సాగర్ సీఐ శ్రీనునాయక్, విజయపురి టౌన్ ఎస్ఐ ముత్తయ్య ఆధ్వర్యంలో కృష్ణా నదిలో గాలింపు చర్యలు చేపడుతున్నా ఇప్పటివరకు ఆచూకీ లభించలేదు.

అప్రమత్తంగా ఉండండి

- ఉమ్మడి జిల్లా వాసులకు ఇబ్బంది రానీయొద్దు
- వర్షాభావ పరిస్థితులు, వరద సహాయక చర్యలపై ఉన్నతస్థాయి సమీక్ష
- అలసత్వం వహించొద్దని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు

సాక్షి,రంగారెడ్డి జిల్లా: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాసులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత ఉన్నతాధికారులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. గురువారం రాత్రి వర్షాభావ పరిస్థితులు, వరద సహాయక చర్యలపై కలెక్టర్లు, జీహెచ్ఎంసీ, జలమండలి, టీజీఎస్పీడీసీఎల్, సైబరాబాద్, రాచకొండ పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించారు. శేరిలింగంపల్లి, హైటెక్ సిటీ పరిసరాలు, సరూర్‌నగర్, ఉప్పల్, షేక్‌పేట్, కూకట్‌పల్లి, బాలానగర్, మల్కాజిగిరి, బండ్లగూడ, నాగోల్, మూసీ నది పరివాహక ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితిని అడిగి తెలుసుకుని మార్గనిర్దేశం చేశారు. కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అందుకు అనుగుణంగా సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాత్రిపూట కూడా విధులు నిర్వర్తించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రజలు తమ ఇబ్బందులను తెలియజేసేందుకు వీలుగా తక్షణమే కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి, వాటిపై ప్రసార, సామాజిక మాధ్యమాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా రోడ్లపై నిలిచిన నీటిని వెంటనే తొలగించాలన్నారు. హైటెక్ సిటీ పరిసర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, అక్కడ నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. వారికి కావాల్సిన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించడంలో ఏమాత్రం అలసత్వం వహించొద్దని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రతి సమస్యకూ తక్షణ పరిష్కారం చూపించాలన్నారు. ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని ప్రభుత్వం మీ వెంట ఉందని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మరణంలోనూ జంటగా..



ప్రసాద్‌రావు, పార్వతి (ఫైల్)

షాబాద్: ఆ అన్యోన్య దంపతుల బంధాన్ని మృత్యువు సైతం వేరు చేయలేకపోయింది. భర్త మరణాన్ని తట్టుకోలేని భార్య గంటల వ్యవధిలోనే ప్రాణాలు వదిలేసింది. ఈ ఘటన హైతాబాద్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన అన్నె ప్రసాద్‌రావు(83), పార్వతి (72) దంపతులు హైతాబాద్‌లో ఉంటున్నారు. బుధవారం రాత్రి ప్రసాద్‌రావు అస్వస్థతకు గురికావడంతో శంషాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ విషయం తెలియగానే తీవ్ర మానసిక క్షోభకు గురైన పార్వతి గుండెపోటుతో మరణించింది. స్థానిక శ్మశానవాటికలో గురువారం ఇద్దరి అంత్యక్రియలను ఒకేసారి నిర్వహించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆటో లాక్కెళ్లారని మనస్తాపం

- ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య
- నక్కలపల్లిలో విషాదం



శ్రీకాంత్ (ఫైల్)

మొయినాబాద్: కిస్తులు (ఈఎంఐ) చెల్లించకపోవడంతో ఫైనాన్స్ సంస్థ వారు ఆటో లాక్కెళ్లారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నక్కలపల్లిలో గురువారం వెలుగు చూసింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లికి చెందిన అనిమోని బాలకిష్టయ్య దంపతులకు పిల్లలు లేకపోవడంతో చిన్నతనంలోనే శ్రీకాంత్(26)ను దత్తత తీసుకున్నారు. కొంతకాలానికి బాలకిష్టయ్య దంపతులు చనిపోయారు. దీంతో ఆయన మేనఅల్లుడు, నక్కలపల్లికి చెందిన బంటు కృష్ణ.. శ్రీకాంత్ బాగోగులు చూస్తున్నాడు. కృష్ణకు చెందిన పాత ఇంట్లో ఒంటరిగా ఉంటున్న శ్రీకాంత్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో కిస్తులు కట్టకపోవడంతో ఐదు రోజుల క్రితం ఫైనాన్స్ సంస్థ వారు వాహనాన్ని తీసుకెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన అతను ఇంట్లోని దూలానికి టవల్‌తో ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో కృష్ణ వెళ్లి చూశారు. శ్రీకాంత్ ఉరేసుకుని వేలాడుతూ కుళ్లిపోయిన స్థితిలో కనిపించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆటో తీసుకెళ్లిన రోజే ఉరేసుకుని ఉంటాడని స్థానికులు పేర్కొన్నారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చంద్రమౌళికి కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు



అవార్డు అందజేస్తున్న మంత్రి తుమ్మల

ఆమనగల్లు: నగరంలోని పీపుల్స్ ప్లాజాలో గురువారం జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల మండలం కొల్కుపల్లి గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు గుర్రం చంద్రమౌళికి కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును ప్రదానం చేశారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో సహజ రంగులతో నూతన డిజైన్‌లో ఇక్కత్ పట్టుచీర నేసిన చేనేత జిల్లా కళాకారుడు చంద్రమౌళిని అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రశంసాపత్రం, రూ.25వేల విలువైన చెక్కు, మెమొంటో అందజేశారు. అనంతరం చంద్రమౌళిని పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు కృష్ణయ్య, ప్రవీణ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌కుమార్, రాజేశ్, భాస్కర్, వెంకన్న, సాయి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

తవ్వీపోదురు గాక..!

- సమన్వయం బూటకం.. సమస్యలే వాస్తవం
- వర్షాల వేళ ఎవరి దారి వారిదే
- అడ్డదిడ్డంగా ప్రభుత్వ విభాగాలు పనితీరు
- తవ్విపారేసిన రోడ్లతో నరక యాతన
- నగర వాసులకు తప్పని వరద కష్టాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వానలొస్తే జనం చస్తున్నారు. ఉప్పొంగే నాలాలు.. చెరువులయ్యే రోడ్లతో ముందుకు సాగలేక అల్లాడుతున్నారు. ఎప్పుడో వేసవిలోనే పూర్తి చేయాల్సిన పనుల్ని సైతం పెండింగ్‌లో పెట్టి.. జలమండలి, టెలికాం, తదితర సంస్థలు అడ్డంగా తవ్విపారేసిన రోడ్లతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. ఏ పనులు ఏ సంస్థవో తెలియని సామాన్య ప్రజలు అన్నీ జీహెచ్ఎంసీవేనని భావించి దుమ్మెత్తిపోస్తున్నారు. జీహెచ్ఎంసీ చేయాల్సిన పనులకూ ట్రాఫిక్ విభాగం నుంచి సకాలంలో అనుమతులు లభించడం లేవని సమాచారం. ఇవి సమస్యలకు కారణాలు కాగా.. వర్షాకాల సమస్యల పరిష్కార బాధ్యతలు హైడ్రాకు అప్పగించాక వాటిలోనూ సమన్వయం కుదరడం లేదు. ప్రకటనల్లో మాత్రం సమన్వయంతో పని చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలోని హైడ్రా సిబ్బంది జీహెచ్ఎంసీని ఖాతరు చేయడం లేదని తెలుస్తోంది. ముందస్తు చర్యల్లో భాగంగా మ్యాన్‌హోళ్ల మూత లు, డివైడర్ల చివరన పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించకపోవడంతో వరదనీరు నిలిచిపోతోంది.



అనుమతుల్లేకుండా అడ్డగోలు తవ్వకాలు

- హైదరాబాద్ మెట్రో వాటర్ సప్‌లై అండ్ సివరేజి బోర్డు (జలమండలి) నిర్వాకాలు శాపంగా మారాయి. తాగునీరు, మురుగునీటి పైపులైన్ల కోసం ఎక్కడ పడితే అక్కడ అడ్డగోలుగా జరిపిన తవ్వకాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో చేయాల్సిన మ్యాన్‌హోళ్ల పనులు ఇప్పుడు చేస్తున్నారు. పనులు చేశాక సరిగా చదును చేయడం లేదు. సివర్ లైన్ల కోసం తవ్వకాలు జరిపీ, మట్టికుప్పలు అడ్డగోలుగా వదిలేస్తున్నారు. దాంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.
- ఉదాహరణకు ఎన్ఎండీసీ– విజయనగర్ కాలనీ రోడ్ మార్గంలో తవ్వకాలు జరిపి రోడ్డు మూసేశారు. దాంతో ఇతర దారుల్లో తీవ్రట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. ఇక్కడే కాదు, ప్రధాన రహదారులు, కాలనీ రోడ్లు అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ రోడ్లను తవ్వి పారేశారు. ఇవన్నీ ఎలాంటి అనుమతుల్లేకుండా తవ్వినవే.

ఎందుకిలా?

వర్షాకాలానికి ముందే వివిధ ప్రభుత్వ విభాగాలు ప్రజల సదుపాయార్థం తాము చేయాల్సిన పనులుంటే పరస్పర సమన్వయం, సహకారంతో పూర్తిచేయాలి. కానీ అది జరగడం లేదు. ఉదాహరణకు ఒక రోడ్డు వేయాలంటే ఆ మార్గంలో ఏర్పాటు చేయాల్సిన ఇతర విభాగాల పనులుంటే పూర్తయ్యాక వేయాలి. కానీ అది జరగడం లేదు. జీహెచ్ఎంసీ రోడ్లు వేయడం.. ఇతర విభాగాలు తవ్వడం.. మళ్లీ రోడ్లు వేయడం పరిపాటిగా మారింది. సకాలంలో ట్రాఫిక్ అనుమతులు లభించకపోవడం కూడా పనుల జాప్యానికి కారణమవుతోంది. బంజారాహిల్స్‌లో నాలాలో కుంగిన వాటర్‌ట్యాంకర్‌ను బయటకు తీసేందుకు కూడా ఎంతో సమయం పట్టడాన్ని ప్రజలు ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తినప్పుడు ఆ తప్పు ఎదుటివారి మీదకు నెట్టడం.. ప్రశంసలైతే తామే అని చెప్పుకోవడం అన్ని విభాగాలకూ అలవాటుగా మారింది.

మురుగునీటిని వరద కాల్వల్లో కలపడంతో వాటిలో మురుగు పొంగుతోంది. వర్షాల వేళ రోడ్లపై పెద్ద ప్రవాహాలు ఏర్పడుతున్నాయి. చాదర్‌ఘాట్, మలక్‌పేట తదితర ప్రాంతాల్లో తరచూ కనిపించే దృశ్యాలే ఇందుకు నిదర్శనం. ఇక వర్షాల వేళ ట్రాఫిక్ విభాగం పనితీరు సోమవారం నాటి వర్షంతో బట్టబయలైంది. సాధారణంగా పది నిమిషాల్లో వెళ్లాల్సిన దూరానికి రెండు గంటలకు పైగా పట్టింది. చలానాల విధింపుపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మనువాదాన్ని వ్యతిరేకించాలి



సదస్సులో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్

కందుకూరు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దళితులపై దాడులు జరుగుతున్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా మైనార్టీ వర్గాలపై దాడులకు తెగబడుతుందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో కందుకూరు, మహేశ్వరం, తలకొండపల్లి మండలాలకు సంబంధించిన ప్రజాసంఘాలతో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళిత టీచర్లతో అయ్యప్ప మాల వేసిన విద్యార్థి కాళ్లు మొక్కించి మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. గుడుల్లో దళితులకు ప్రవేశం లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఒకవేళ ప్రవేశిస్తే ఆలయాలను శుద్ధి చేస్తున్నారన్నారు. ఇదంతా కేంద్రంలో మోదీ, అమిత్‌షా పాలనతోనే జరుగుతుందని విమర్శించారు. మతోన్మాదానికి, మనువాదానికి వ్యతిరేకంగా ప్రజలందరిని చైతన్య పరచడానికి ఈ నెల 13న ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో జిల్లా సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ హాజరవుతున్నారన్నారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, కేవీపీఎస్ మండలాల కన్వీనర్లు ఏర్పుల శేఖర్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె వెళ్లిపోయిందని..

మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమార్తె పెళ్లైన వ్యక్తితో వెళ్లిపోవడంతో మనస్తాపానికి లోనైన ఆమె తండ్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంగళరావునగర్‌కు చెందిన జంగిటి రామస్వామి (50) ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండగా అతడి భార్య లక్ష్మి బుద్ధభవన్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో స్వీపర్‌గా పని చేస్తుంది. గత నెల 30న అతడి కుమార్తె పెళ్లైన వ్యక్తితో వెళ్లిపోయింది. దీంతో రామస్వామి రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో మనస్తాపానికి లోనైన రామస్వామి బుధవారం రాత్రి భోజనం చేసిన తర్వాత గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. గురువారం ఉదయం లక్ష్మి భర్తను నిద్ర లేపేందుకు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కత్తి దాడి నిందితుడికి రిమాండ్

మొయినాబాద్: పశువుల మేత విషయంలో గొడవ పడి భార్యాభర్తలపై కత్తితో దాడి చేసిన నిందితున్ని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన హఫీజ్, వా జిద్ ఖురేషీ బుధవారం పశువుల మేత విషయంలో గొడవ పడ్డారు. మాటా మాటా పె రగడంతో హఫీజ్ కత్తితో వాజిద్, అతని భా ర్య రఫియాపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో హఫీజ్‌ను అదుపులోకి తీ సుకుని విచారించారు. గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తీవ్ర గాయాల తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్యాభర్తల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

కలివివనం పాట ఆవిష్కరణ

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలనే కాన్సెప్ట్‌తో తీసిన కలివివనం సినిమా అందరినీ ఆలోచింపజేస్తుందని చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, సినీ నటుడు బిత్తిరి సత్తి అన్నారు. పట్టణంలోని కేజీఆర్ గార్డెన్‌లో గురువారం సాయంత్రం చేవెళ్ల ప్రాంతానికి చెందిన నిర్మాతలు మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ఏఆర్ క్రియేషన్స్‌పై నిర్మించిన చిత్రంలోని ఓ పాటను ఆవిష్కరించారు. స్థానిక వివేకానంద కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో స్థానిక నాయకులు సీడీని విడుదల చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజ్‌నరేంద్ర, సినిమా హీరోయిన్ నాగదుర్గ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, సీనియర్ నటుడు గాంధీ, చిత్ర యూనిట్ సభ్యులు, చేవెళ్ల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆప్యాయతల 'రక్షాబంధన్'

సోదరి కష్టసుఖాల్లో అనుక్షణం తోడుగా ఉండేందుకు సోదరులకు కట్టే రక్షాబంధన్ పర్వదినం రానే వచ్చేసింది. అనురాగం, ఆప్యాయతల మేళవింపులో జరుపుకొనే అపూర్వ వేదికకు ప్రతి తోబుట్టువు ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం పర్యావరణ హితంగా పండుగను నిర్వహించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

అక్కాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా రాఖీ పండుగ



వివిధ రకాల డిజైన్ రాఖీలు



కొనుగోలుకు సిద్ధంగా పూసల రాఖీలు

షాబాద్: అక్కాచెల్లెళ్లు.. అన్నాదమ్ములకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకుంటారు.. ఏటా రాఖీ పండుగను ఘనంగా జరుపుకొంటారు.. విదేశాల్లో ఉన్న వారు కూడా రక్షాబంధన్‌కు ఇక్కడికి వచ్చి అన్నాదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపిస్తారు. శనివారం జరుపుకొనే రాఖీ పండుగకు ఆడపడుచులు పుట్టింటికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. తల్లిదండ్రుల తర్వాత అనుబంధం, అనురాగం, ఆప్యాయత తోబుట్టువుల మధ్య ఉంటుంది. ఇంటి ఆడపడుచుల సుఖసంతోషాలే తమ సంతోషంగా భావిస్తారు. సోదరులు ఇంతటి విశిష్టమైన అనుబంధానికి ప్రతీకగా, సోదరుల క్షేమం కోరుతూ ఏటా శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి రోజున రక్షాబంధన్ నిర్వహిస్తారు.

మొదలైన సందడి

అనుబంధాలకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చే హిందూ సంస్కృతిలో రక్షాబంధన్‌కు విశిష్టమైన స్థానం ఉంది. సోదరి, సోదరుల అనురాగానికి చిహ్నంగా ఈ వేడుక జరుపుకొంటారు. ఇళ్లల్లోనే కాకుండా ఆలయాల్లో, సామూహిక వేదికల వద్ద ఈ పర్వదినాన్ని ఆనందోత్సాహాల నడుమ నిర్వహించుకోనున్నారు. బాలికలు, యువతులు, మహిళలు అంతా రాఖీ బంధన్ వేడుకను నిర్వహించేందుకు నాలుగు రోజుల ముందు నుంచే ఆడపడుచులు ఉత్సాహంగా రాఖీలు కొనుగోలు చేయడం మొదలుపెట్టారు.

దీక్ష సంకల్పమే రక్ష

ఏదైనా కార్యక్రమం నిర్వహించ తలపెట్టినప్పుడు రక్షను ధరించడం హైందవ ఆచారం. ఆ కార్యక్రమం ఏ విఘ్నాలు లేకుండా సజావుగా సాగాలని, అనుక్షణం లక్ష్యాన్ని గుర్తు చేసేందుకు ఈ రక్షను ధరిస్తారు. వివాహం, యజ్ఞయాగాదులు, వ్రతాలు, నోములు తదితర కార్యక్రమాల్లో ఈ రక్షాధారణ తప్పనిసరి. పూర్వకాలంలో యుద్ధానికి వెళ్లే భర్తలకు భార్యలు, సోదరుల క్షేమాన్ని కాంక్షిస్తూ సోదరీమణులు రక్షలు కట్టేవారు. ఆనాటి నుంచి ఆనవాయితీగా ఈ ఆచారం వస్తోంది.

జోరుగా రాఖీల విక్రయాలు

అన్నాచెల్లెల్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ దగ్గర పడుతుండడంతో మండలంలో రాఖీల క్రయ విక్రయాలు జోరందుకున్నాయి. మారుతున్న కాలానికి, అభిరుచులకు అనుగుణంగా, దుకాణదారులు పలు డిజైన్లల్లో రాఖీలు అందుబాటులో ఉంచారు.

ప్రకృతి మెచ్చిన 'వృక్షాబంధన్'



చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థులు

కడ్తాల్: ప్రకృతికి మానవాళి రక్షణగా ఉండాలనే గొప్ప సంకల్పంతో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ వినూత్నంగా గత 12 ఏళ్లుగా విద్యార్థులతో కలిసి చెట్లకు రాఖీలు కట్టి వృక్షాబంధన్ నిర్వహిస్తోంది. ప్రకృతికి మానవాళికి మధ్య సైతం అనుబంధం పెంపొందాలనే సదుద్దేశంతో వృక్షాబంధన్ కార్యక్రమం ఏటా దిగ్విజయంగా కొనసాగుతుంది. పిల్లలు, యువకులు, గ్రామస్తులు, విద్యార్థులు అందరి ఆధ్వర్యంలో పర్యావరణ హితంగా 'నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష... మనమంతా భూమాతకు రక్ష' అనే గొప్ప సంకల్పంతో వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహిస్తారు.



చెట్టుకు రాఖీ కడుతున్న చిన్నారులు (ఫైల్)

ఆవు పేడతో రాఖీలు



ఆవు పేడతో తయారు చేసిన రాఖీ



రాఖీని చూపుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలాంటి హాని కలుగచేయని వస్తువులను వినియోగించాలని ప్రకృతి ప్రేమికులు పదే పదే చెబుతుంటారు. ఈ క్రమంలోనే మరో ముందడుగు వేసి ఆవు పేడ, మూత్రంతో ఏకంగా రాఖీలను తయారు చేశారు. పర్యావరణాన్ని రక్షించుటతో హిందూ సంప్రదాయ పండగలు సైతం తమ వంతు పాత్ర పోషిస్తాయనేది సహజసిద్ధంగా తయారు చేసిన రాఖీలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. తాండూరు పట్టణ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి ఏటా పర్యావరణ ప్రేమికురాలిగా తన వంతు బాధ్యతగా ఆవు పేడ, మూత్రంతో తయారు చేసిన రాఖీలను సోదరులకు కట్టాలని ఆమె చెబుతున్నారు. ఈ రాఖీలు తిరిగి భూమిలోకి చేరి మట్టి సారవంతాన్ని పెంపొందిస్తాయంటున్నారు. పరిగి ప్రాంతానికి చెందిన శివరామకృష్ణా చారి అనే వ్యవసాయ విద్య అభ్యసించిన ఓ యువకుడు దీర్ఘాయుష్మ అనే సంస్థను నెలకొల్పి ఆవు పేడ, మూత్రంతో రాఖీలను తయారు చేసి, పర్యావరణ పరిరక్షణపై తన వంతు బాధ్యతను బహిర్గతం చేస్తున్నారు. ఇలాంటి రాఖీలు మార్కెట్‌లో విక్రయానికి సైతం పెట్టడం విశేషం.

సీసీ కెమెరాలతో నిఘా పటిష్టం

ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఏసీపీ రాజు తదితరులు

యాచారం: సీసీ కెమెరాలుంటే పోలీస్ నిఘా ఉన్నట్లేనని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లిలో గురువారం సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు బిగించుకోవాలని సూచించారు. రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు, యువకులు సమష్టిగా డబ్బులు జమ చేసి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలు జరిగినప్పుడు సులభంగా నేరస్తులను గుర్తించే అవకాశం ఉందన్నారు. సీసీ కెమెరాలుంటే నేరాలు, చోరీలు తగ్గుముఖం పడుతాయన్నారు. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలు, మరో 20కి పైగా అనుబంధ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతల సహకారం కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్ఐ మధు, గ్రామస్తులు శ్రీశైలం, సంతోష, మల్లేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇచ్చిన మహిళ కిడ్నాప్

- కారులో తీసుకెళ్తుండగా.. మరో కారును ఢీకొన్న వైనం
- మహిళతో పాటు ఇద్దరికి గాయాలు

శంషాబాద్ రూరల్: రెండు రోజుల క్రితం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదం ఘటన మహిళ కిడ్నాప్ కథగా మారింది. శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చేవెళ్ల మండలం, ఆలూరు వాసి కొండకల్ల పద్మజ అదే గ్రామానికి చెందిన కమ్మెట విజయ్‌గౌడ్‌కు రూ.నాలుగు లక్షలు అప్పుగా ఇచ్చింది. డబ్బులు తిరిగి ఇచ్చే విషయమై వారి మధ్య గొడవ జరిగింది. దీంతో విజయ్‌గౌడ్ ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో పద్మజ భర్త బుచ్చయ్యను చికిత్స నిమిత్తం మల్కారంలోని ఆశాజ్యోతి ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నెల 5న భర్తకు దుస్తులు ఇచ్చేందుకు వచ్చిన పద్మజను గుర్తించిన విజయ్‌గౌడ్, వెంకటేష్, సాయితో కలిసి ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. కారు కొత్వాల్‌గూడ శివారులో ఔటర్ సర్వీసు రోడ్డులో వెళ్తుండగా.. అదుపుతప్పి ఎదురుగా వచ్చిన బీఎండబ్ల్యూ కారును ఢీకొంది. ఈ ఘటనలో పద్మజ, విజయ్‌గౌడ్, సాయికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రెండు కార్లు ధ్వంసమయ్యాయి. బీఎండబ్ల్యూ కారులో ఉన్న వారు ఆర్జీఐ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఎర్టిగా కారులో ఉన్న పద్మజను విచారించగా.. తనను కిడ్నాప్ చేసినట్లు తెలిపింది. దీంతో శంషాబాద్ పోలీసులు గురువారం ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని..

యువకుడిపై హత్యాయత్నం

బంజారాహిల్స్: తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని కక్ష పెంచుకున్న ఓ వ్యక్తి దారికాచి ఆమె ప్రియుడిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ ఆదిల్ టెంట్‌హౌస్‌లో పని చేసేవాడు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10సీ లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో ఓ ఇంట్లో వంట మనిషిగా పని చేస్తున్న బోయిన్‌పల్లికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ప్రతిరోజూ ఆదిల్ ఆమెను ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో బైక్‌పై ఎక్కించుకుని బోయిన్‌పల్లిలో ఇంటి సమీపంలో వదిలేసేవాడు. బుధవారం రాత్రి ఆదిల్ ఆమెను బైక్ ఎక్కించుకుని జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు మీదుగా వెళ్తుండగా అప్పటికే పథకం ప్రకారం చెక్‌పోస్టు సమీపంలో దారికాచిన ఆమె భర్త అంజద్ వీరిని అడ్డగించాడు. అందరూ చూస్తుండగానే ఆదిల్ తలపై బండరాయితో మోది అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆదిల్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. గురువారం వికారాబాద్‌లోని సంగం లక్ష్మీబాయి రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు విద్యా బోధన ఎలా చెబుతున్నారని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పరిశుభ్రమైన తాగునీటిని వాడాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

చందానగర్ : రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చందానగర్ పాపిరెడ్డి కాలనీకి చెందిన వెదురుపాక సంతోష్‌కుమార్ (30) ఇటీవల ఉద్యోగం కోల్పోయాడు. గత కొన్నాళ్లుగా ఉద్యోగం కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో మనస్తాపానికి లోనైన అతను గురువారం చందానగర్ నుంచి హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మాదకద్రవ్యాల విక్రేతల అరెస్ట్

66 గ్రాముల హెరాయిన్, బ్రౌన్ షుగర్ స్వాధీనం

చందానగర్: హెరాయిన్, బ్రౌన్ షుగర్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ క్రిష్ణ ప్రియ ఆదేశాల మేరకు శంషాబాద్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో డీటీఎఫ్ పోలీసులు బుధవారం ఖాజాగూడలో హెరాయిన్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన నూర్ అక్తర్, అజిత్ మెమిన్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 66 గ్రాముల హెరాయిన్, బ్రౌన్ షుగర్‌తో పాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీసులు అప్పగించడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుళ్లు గణేష్, మల్లేష్, నెహ్రూ, సాయి శంకర్ పాల్గొన్నారు.

బీసీలు అన్ని రంగాల్లో రాణించాలి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



విఠలయ్యకు నియామకపత్రం అందజేస్తున్న బర్క కృష్ణ తదితరులు

షాబాద్: బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో బీసీసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం బీసీసేన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కడుమూరు విఠలయ్య, ఉపాధ్యక్షుడిగా కడుమూరి అశోక్, ప్రధాన కార్యదర్శిగా కావలి రాములు, కోశాధికారిగా కావలి సత్తయ్యలను ఎనుకున్నారు. యువజన కమిటీ అధ్యక్షుడిగా కావలి సందీప్, ప్రధాన కార్యదర్శిగా కడుమూరి ఆనంద్, ఉపాధ్యక్షుడిగా మహేందర్, కార్యదర్శిగా బుగ్గరాములు, కోశాధికారిగా ఉండాల మల్లేష్‌లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. ఆధిపత్య పోరుతోనే బీసీలు అన్ని రంగాల్లో వెనకబడుతున్నారని చెప్పారు. అందుకే బీసీలకు అండగా ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి బీసీలను బలోపేతం చేస్తున్నామన్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, మండల అధ్యక్షులు దయాకర్‌చారి, యూత్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌పై థర్డ్ డిగ్రీ ఎంటీ?

పోలీస్ కమిషనర్‌పై హెచ్ఆర్‌సీ ఆగ్రహం

- ఆగస్టు 12లోగా పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశం

సిటీ కోర్టులు : 17 ఏళ్ల బాలుడిని అక్రమంగా నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడమేమిటని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనికి సంబంధించిన పూర్తి నివేదికను ఆగస్టు 12లోగా కమిషన్ ముందు ఉంచాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌ను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిశోర్‌తో కూడిన బెంచ్ ఆదేశించింది. అంతే కాకుండా సీపీ స్వయంగా కమిషన్ ఎదుట హాజరుకావాలని పేర్కొంది. వివరాల్లోకి వెళితే.. దగ్గుపాటి రాంబాబు కుమారుడు దగ్గుపాటి అజిత్ కుమార్ శర్మను (17)ను 2024 డిసెంబర్ 15 నుంచి 17 వరకు జూబ్లీ హిల్స్ పోలీసులు అక్రమంగా నిర్బంధించి, దారుణంగా హింసించారని రాంబాబు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కొట్టడం వల్ల తన కుమారుడు నడవలేనిస్థితిలో ఉన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వీడియో ఆధారాలతో సహా కమిషన్‌ను ఆశ్రయించాడు. దీనిపై గురువారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ విచారణ చేపట్టింది. అయితే గత విచారణ సందర్భంగా ఈ ఘటనకు సంబంధించి జూన్ 30లోగా పూర్తి నివేదికను అందజేయాలని అదే విధంగా థర్డ్ డిగ్రీకి పాల్పడిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీపీకి ఆదేశాలు జారీ చేస్తూ నోటీసులు ఇచ్చింది. అయితే పోలీసులు కమిషన్ ఆదేశాలు పాటించకపోవడమేగాక నివేదికను అందజేయకపోవడంతో మానవహక్కుల కమిషన్ తీవ్రంగా మండి పడింది. ఈ నిర్లక్ష్యానికి నగర పోలీస్ కమిషనర్ బాధ్యత వహిస్తూ పూర్తి స్థాయి నివేదికతో ఈనెల 12లోగా వ్యక్తిగతంగా కమిషన్ ఎదుట హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించింది. అదేవిధంగా బాలుడి ఆరోగ్యపరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తుందని తండ్రి ఆవేదన మేరకు వెంటనే బాలుడిని పరీక్షించి మెరుగైన వైద్య సేవలు అందించాలని నిమ్స్ సూపరింటెండెంట్‌ను కమిషన్ ఆదేశించింది. నిమ్స్‌లో ఇన్ పేషేంట్‌గా బాలుడికి చికిత్స అందించాలని, బాలుడి ఆరోగ్య పరిస్థితిపై 48 గంటల్లోపు వివరణాత్మక నివేదికను అందజేయాలని సూచిస్తూ కమిషన్ తదుపరి విచారణను ఆగస్టు 12కు వాయిదా వేసింది.